సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



వాసవీ మాతకు నీరాజనం

పెనుగొండ : పెనుగొండ వాసవీ మాత ఆలయం, వాసవీ శాంతి థాంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



మంగళసూత్రాల సమర్పణ

నిడమర్రు: భద్రాచలం సీతారాములకు పెద నింద్రకోలను భక్తులు రూ.లక్ష విలువైన బంగార మంగళ సూత్రాలను ఆదివారం సమర్పించినట్టు జెడ్పీటీసీ కోడే కాశీ తెలిపారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు



పెదవేగి: రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి ఒక్కరోజు ఆదాయం రూ.1.36 లక్షలు లభించింది.

న్యూస్‌రీల్

హ్యాండ్‌బాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న మహిళలు

దెందులూరు : నిరంతర సాధన, క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించవచ్చని హ్యాండ్‌బాల్ ఏలూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అలివేలు అన్నారు. ఆదివారం మండలంలోని వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ సీనియర్ మహిళల పోటీలు ప్రారంభమయ్యాయి. 10 జిల్లాల నుంచి జట్లు హాజరయ్యాయి. రెండు రోజులపాటు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఏఓ కరుణానిధి తెలిపారు. తొలిరోజు వివిధ జిల్లాల జట్ల మధ్య ఏడు మ్యాచ్‌లు జరిగాయన్నారు. సోమవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీబీసీడబ్ల్యూఓ నాగరాణి

కైకలూరు: జిల్లాలో పదో తరగతి చదువుతున్న బీసీ హాస్టళ్ల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఏలూరు జిల్లా బీసీ హాస్టళ్ల సంక్షేమాధికారి (డీబీసీడబ్ల్యూవో) ఆర్వీ నాగరాణి అన్నారు. మండలంలోని కొల్లేటికోట, కైకలూరు బాలురు, కలిదిండి బాలికలు, కైకలూరు కాలేజీ బీసీ హాస్టళ్లను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి డీబీసీడబ్ల్యూఓ నాగమణి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బీసీ హాస్టళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు 180 మంది ఉన్నారన్నారు. పది మంది విద్యార్థులు పైబడిన హాస్టళ్లలో ట్యూటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో పదో తరగతి విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కొల్లేటికోట హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను 50 శాతం వరకు తీసుకువస్తే నాడు–నేడు పనుల్లో నూతన భవనానికి అనుమతులు తీసుకువస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే ఐదు హాస్టళ్లలో నాడు–నేడు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇటీవల హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓ, కుక్‌లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. హెచ్‌డబ్ల్యూఓలు పి.సురేష్‌బాబు, ఎం.శ్రీదేవి, పి.రవి ప్రసాద్, ఎం.రాధ పాల్గొన్నారు.

అరుణాచలం యాత్రకు ఆర్టీసీ బస్సులు



భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలోని 4 డిపోల నుంచి అరుణాచలం యాత్రకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 5, ఏప్రిల్ 4, మే 3, జూన్ 2వ తేదీల్లో రాత్రి 7 గంటలకు సర్వీసులు బయలుదేరతాయని, తిరిగి వచ్చేనెల 8, ఏప్రిల్ 7, మే 6, జూన్ 5వ తేదీ ఉదయం 7 గంటలకు ఆయా సర్వీసులు డిపోలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం చేరే సర్వీసు భీమవరం డిపో నుంచి ఒక్కో టికెట్ ధర రూ.2,500, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి రూ.2,600 గా నిర్ణయించామని తెలిపారు.

ఇక్కట్లు ఉండవిక.. చప్పట్లే!

గోదావరి తీరంలో భారీ వాటర్ గ్రిడ్

- రూ.1,400 కోట్ల వ్యయంతో మూడు జిల్లాల్లో 1,250 గ్రామాలకు మంచినీరు
- 26 మండలాల్లో 18.50 లక్షల మందికి మేలు
- చెంతనే గోదావరి ఉన్నా.. సముద్ర తీరంలో మంచినీటికి ఇక్కట్లు
- విజ్జేశ్వరం జలాశయం నుంచి భారీ పైపులైన్ల ఏర్పాటు
- 30 నెలల కాల వ్యవధిలో ప్రాజెక్టు పూర్తి
- పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో సర్వే పనులు ప్రారంభం
- ఏప్రిల్ మొదటి వారం నుంచి నిర్మాణ పనులు



పశ్చిమగోదావరి జిల్లాలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సర్వే చేస్తున్న సిబ్బంది



వాటర్ సప్లయ్ ప్రాజెక్టు మ్యాప్

సాక్షి ప్రతినిధి, ఏలూరు : సముద్రతీర ప్రాంతంలో తాగునీటి సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వతంగా చెక్ పెడుతోంది. దశాబ్దాలుగా గోదావరి చెంతనే ఉన్నా తీర ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు ఉప్పుకయ్యలుగా మారి తాగునీరు దొరకని పరిస్థితి. వీటికి పరిష్కారం చూపేలా కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో భారీ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును రూపొందించారు. దీని ద్వారా తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాలోని కొన్ని మండలాలను కలిపి మొత్తం 26 మండలాల్లోని 1,250 గ్రామాలకు రక్షిత మంచినీరు అందించనున్నారు. రూ.1,400 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టును కేంద్రం రూ.700 కోట్లు, రాష్ట్రం రూ.700 కోట్ల నిధుల భాగస్వామ్యంతో నిర్మించనున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పాదయాత్ర చేసిన సమయంలో నరసాపురం మొదలుకుని నిడదవోలు వరకు అనేకమంది తాగునీటి ఇబ్బందుల గురించి ఆయనకు విన్నవించారు. దీంతో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టడంతో పాటు రెండునెలల క్రితం నరసాపురంలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రూ.1,400 కోట్లతో రూపొందించిన ప్రాజెక్టు టెండర్లను మేఘా కంపెనీ రివర్స్ టెండర్ల ద్వారా దక్కించుకుంది. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ.45.75 కోట్లు ఆదా అయింది. ప్రస్తుతం మేఘా కంపెనీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో చేపట్టిన సర్వే ప్రక్రియ తుదిదశకు చేరింది. విజ్జేశ్వరం వద్ద ర్యాపిడ్ సాల్ట్ ఫిల్టర్‌తో పాటు మూడు జిల్లాల్లో 62 హెడ్ వాటర్ ట్యాంకులు, పైపులైన్లను ఏర్పాటు చేసే ప్రాంతాలను ఖరారు చేశారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి పనులు ప్రారంభించనున్నారు.

ఏఏ జిల్లాలకు మేలంటే..

తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు, పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం, ఉండి, తాడేపల్లిగూడెం, ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, దెందులూరు, కృష్ణా జిల్లాలోని కృతివెన్ను, బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరు అర్బన్, గ్రామీణ ప్రాంతాలకు దీని ద్వారా సురక్షిత తాగునీరు అందనున్నారు. నాలుగు జిల్లాల్లోని 26 మండలాల్లో 1,250 గ్రామాలకు చెందిన 18.50 లక్షల మందికి దీని ద్వారా తాగునీరు అందుతుంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా శాశ్వత పరిష్కారం లభించనుంది.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా..

ఇప్పటికే అధికారులు విజ్జేశ్వరం మొదలుకుని కృష్ణా జిల్లాలోని చివరి గ్రామాల వరకు సర్వే పూర్తిచేశారు. ప్రధానంగా విజ్జేశ్వరం జలాశయం వద్ద ఇన్‌టెక్ వెల్ కమ్ పంప్ హౌస్‌ను నిర్మించే ప్రాంతాన్ని గుర్తించారు. అక్కడే ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్లు, సంపులతో భారీ పంప్‌హౌస్‌ను నిర్మించి నాలుగు జిల్లాల్లో గుర్తించిన 62 ఓవర్‌హెడ్ ట్యాంకులకు గోదావరి జలాలను శుద్ధిచేసి తరలిస్తారు. అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. మొత్తంగా 396.517 కిలోమీటర్ల మేర భారీ పైపులను ఏర్పాటుచేసి వాటికి అనుసంధానంగా 2,102.623 కిలోమీటర్ల పైపులను ఏర్పాటుచేస్తారు. 30 నెలల కాలవ్యవధిలో పూర్తయ్యే ఈ ప్రాజెక్టును తరువాత 12 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కూడా మేఘా కంపెనీవే.

తుది దశలో సర్వే



వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సర్వే పనులు పూర్తయ్యాయి. 30 నెలల కాలంలో పనులు పూర్తిచేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. తాగునీటి ఎద్దడికి వాటర్ గ్రిడ్ ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పనులు శరవేగంగా జరిగేందుకు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నాం.

–పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

తాగునీటి కష్టాలకు పరిష్కారం



రూ.1,400 కోట్ల వ్యయంతో ఉమ్మడి జిల్లాలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాలతో పాటు ఏలూరుకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వై.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

రాష్ట్రంలో మెరుగైన విద్యావిధానం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న చిన్నంశెట్టి సురేష్

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న విద్యావ్యవస్థను యావత్ భారతదేశం అనుసరిస్తుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదివారం అన్నారు. విద్యార్థులు విద్యను పూర్తి చేసుకున్న అనంతరం ఉద్యోగం, ఉపాధిని సాధించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో విద్యా విధానంలో నూతన మార్పులు తీసుకువచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమగోదావరి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చిన్నంశెట్టి సురేష్ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి కొట్టును కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. సురేష్ మాట్లాడుతూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు జిల్లాస్థాయి నాయకత్వంలో స్థానం ఇచ్చినందుకు మంత్రి కొట్టుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విద్యా విభాగంలో స్థానం పొందిన ప్రతిఒక్కరూ తమ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను చైతన్యవంతులను చేసేలా కృషి చేయాలన్నారు అలాగే క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పాలనతో సీఎం జగన్ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ విద్యారంగాన్ని అథోగతి పాలుచేసిన చంద్రబాబు విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొట్టు విశాల్, తాడేపల్లి మోషే, చిన్నం జగదీష్, ఉబా వెంకటేశ్వరరావు, సోమా మురళి, ఉర్ల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడెం రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- 'అమృత్ భారత్ స్టేషన్' కింద అభివృద్ధి
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. భవిష్యత్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం త్వరలో నిధులు వెచ్చించనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ కోసం ముఖ్యమైన స్టేషన్లను ఎంపిక చేసింది. విజయవాడ పరిధిలో 23 స్టేషన్లను ఎంపిక చేయగా తాడేపల్లిగూడెంకు చోటు దక్కింది. ఇక్కడ రెండు, మూడేళ్లలో పూర్తయ్యేలా 53 రకాల సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

నూతన సొబగులు

జిల్లాలో ఏ క్లాస్ స్టేషన్ కింద ఉన్న తాడేపల్లిగూడెం నుంచి రోజుకు 2,500 నుంచి 3 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రోజుకు సగటును రూ.3 లక్షల ఆదాయం ఉంది. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉండటంతో పాటు సౌకర్యాల కల్పనకు స్థలం అందుబాటులో ఉన్న ఈ స్టేషన్ కొత్త పథకం ద్వారా నూతన శోభను సంతరించుకోనుంది.

ఏఏ స్టేషన్‌లంటే..

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద విజయవాడ, రాజమండ్రి, మచిలీపట్నం, గుడివాడ, గూడూరు, నెల్లూరు, తెనాలి, ఒంగోలు, సామర్లకోట, తుని, చీరాల, అనకాపల్లి, ఏలూరు, భీమవరం టౌన్, కాకినాడ టౌన్, బాపట్ల, నిడదవోలు, నరసాపురం, గుణదల, రాయనపాడు, సింగరాయకొండ, యలమంచిలి, తాడేపల్లిగూడెం, అనపర్తి స్టేషన్లను ఎంపిక చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

సౌకర్యాలు ఇలా..

- స్టేషన్లను అత్యాధునిక ఐకానిక్ డిజైన్లతో ఆధునికీకరిస్తారు.
- స్టేషన్‌ను అనుసంధానించే విధంగా కొత్త రహదారులు నిర్మిస్తారు.
- ఎస్కలేటర్లు, లిఫ్టు, ఫుట్‌బ్రిడ్జిలు, స్థానిక ఉత్పత్తుల విక్రయానికి స్టాళ్లు ఏర్పాటుచేస్తారు.
- విశాలమైన పార్కింగ్, లాంజ్, రెస్టారెంట్లు, 5జీ టవర్లు ఏర్పాటుచేస్తారు.

బ్యాంక్ అప్రైజర్ చేతివాటం

- రోల్డ్‌గోల్డ్ నగలపై రుణాలు
- రూ.14.15 లక్షల మేర మోసం

జంగారెడ్డిగూడెం: స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) బ్రాంచీలో అప్రైజర్ చేతివాటాన్ని చూపించి రూ.14.15 లక్షలు దుర్వినియోగం చేసినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి.. ఇటీవల బంగారంపై రుణాలకు తరచుగా వస్తున్న ఖాతాదారుల పేర్లను ఉన్నతాధికారులు గుర్తించి దర్భగూడెం బ్రాంచ్ మేనేజర్‌ను తనిఖీ అధికారిగా నియమించారు. ఆ సమయంలో రెండు ఖాతాలకు సంబంధించి బ్యాంకు రుణంలో అప్రైజర్ ఎం.రామశేషాచార్యులు రోల్డ్‌గోల్డ్ వస్తువులపై రుణాలు ఇచ్చినట్లు గుర్తించారు. వీటిలో ఒక వ్యక్తి ఖాతాకు రూ.6.90 లక్షలు, మరో వ్యక్తి ఖాతాకు రూ.7.25 లక్షలు మొత్తంగా రూ.14.15 లక్షలు రుణంగా మంజూరు చేసినట్టు నిర్ధారించారు. అయితే రామశేషాచార్యులు ఖాతాదారులతో మాట్లాడి, రుణాలు చెల్లించేలా చేస్తారని అధికారులు ఎదురుచూశారు. అయితే రుణాలు రికవరీ కాకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రామశేషాచార్యులు 2010 నుంచి ఇక్కడ పనిచేస్తుండగా 2012 నుంచి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. అలాగే మరిన్ని బంగారు రుణాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రూ.14.15 లక్షలు అవినీతికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కాగా, మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని తెలుస్తోంది. దీనిపై బ్రాంచి మేనేజర్ కె.కరుణకుమార్‌ను వివరణ కోరగా, అప్రైజర్ అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించామని, ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్టు చెప్పారు.

ప్రశాంతంగా ప్రయోగ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జనరల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఆదివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. 96 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 7,632 మందికి 7,457 మంది హాజరుకాగా 175 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులకు రెండో విడత ప్రయోగ పరీక్షలను 33 కేంద్రాల్లో నిర్వహించారు. 3,629 మందికి గాను 3,255 మంది హాజరు కాగా 374 మంది గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

దొంగనోట్ల కేసులో ముగ్గురి అరెస్ట్

యలమంచిలి: దొంగనోట్ల కేసులో ఆదివారం ముగ్గురిని అదుపులోనికి తీసుకున్నట్లు యలమంచిలి ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం పెదవేగి మండలానికి చెందిన ఒక వ్యక్తికి యలమంచిలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, పోడూరు మండలం పెనుమదం గ్రామానికి చెందిన మరొక వ్యక్తి కలసి ఏడాది క్రితం రూ. 4 లక్షలు ఇస్తే రూ. 20 లక్షలు దొంగనోట్లు ఇస్తామని ప్రలోభ పెట్టారు. దీంతో అతను వారికి రూ.4 లక్షలు ఇచ్చాడు. ఏడాది గడచినా డబ్బులు ఇవ్వకపోవడంతో అతను పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నూతిలో పడి యువకుడి మృతి


మృతుడు శానం సత్యనారాయణ(ఫైల్)

ఉంగుటూరు: కైకరం గ్రామంలో శుక్రవారం రాత్రి శానం సత్యనారాయణ(35) ప్రమాదవశాత్తు నూతిలో పడి మృతిచెందాడు. పొలం వెళ్ళి తిరిగి వస్తుండుగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సత్యనారాయణకు భార్య మోనిక , కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామి కేసు నమోదు చేశారు. భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. సత్యనారాయణ మృతదేహనికి తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

కమ్మేసిన పొగమంచు


జంగారెడ్డిగూడెంలో దట్టమైన పొగమంచు ఆవరించిన దృశ్యం

ఏలూరు జిల్లాలోని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాలను ఆదివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఎదుటి వ్యక్తి కనిపించనంతగా పొగమంచు కురవడంతో లైట్లు వేసుకుని నెమ్మదిగా వాహనాలు నడుపుతూ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

-జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం


జంగారెడ్డిగూడెంలో దట్టమైన పొగమంచు ఆవరించిన దృశ్యం


బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి సమీపంలోని తోటలను కమ్మేసిన పొగమంచు


బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్ళే దారిలో..

ఎస్సీలను చంద్రబాబు గుర్రాలతో తొక్కించారు

మాల మహానాడు రాష్ట్రాధ్యక్షుడు పుష్పరాజ్

ఉండి: ఎస్సీలను విభజించి పాలించాలనే పన్నాగం పన్నిన చంద్రబాబునాయుడికి వ్యతిరేకంగా పోరాడిన నాటి ఎస్సీ నాయకులను, ప్రజలను గుర్రాలతో తొక్కించి హింసించారని మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఆదివారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజులు నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీల నియామకాన్ని చేపట్టారు. మాలమహానాడు ఉండి నియోజకవర్గ అధ్యక్షుడిగా చిగురుపాటి రాజేష్, ఉపాధ్యక్షుడిగా ఆలమూరి రాజశేఖర్, కార్యదర్శిగా యరగపాటి నవమణిరాజు, యూత్ అధ్యక్షుడిగా మేడిద సాయిజగన్నాథ్, కార్యదర్శిగా నందిగం నవీన్‌కుమార్, ఉండి మండల అధ్యక్షుడిగా తొర్లపాటి భాగ్యరాజు, ప్రధాన కార్యదర్శిగా చుక్కా రవిరాజు, కార్యదర్శిగా బోసి సామ్యూల్‌రాజు, సహాయ కార్యదర్శిగా కొమ్మిన దైవాశీర్వాదం, అర్తమూరు గ్రామ అధ్యక్ష కార్యదర్శులుగా నామాల సంసోను, కాయల సంపతరావు, సంధిరాజు, రామకూరి ఆదాము తదితరులను నియమించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ ఎస్సీలను ఐక్యంగా ఉంచాలని పోరాడితే చంద్రబాబు ఎస్సీ సోదరులను గుర్రాలతో తొక్కించి ఎంతో మంది జీవితాలను నాశనం చేశారన్నారు. మనకు అన్యాయం జరిగిన సమయంలో ఐకమత్యంగా పార్టీలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడుతున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పేలా గతంలో ఢిల్లీ వేదికగా పోరాటాలు చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్సీలంతా వారి పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు రంపా వెంకటేష్, యరగపాటి చిన్నా, అసినిపర్తి సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నార్పీ అగ్రహారంలో నూతన కమిటీ సభ్యులతో మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు పుష్పరాజ్

నేటి నుంచి మదన గోపాలుడి ఆలయ ఉత్సవాలు

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన గోపాల స్వామి ఆలయ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సుమారు 235 సంవత్సరాల నాటి ఈ పురాతన ఆలయాన్ని రూ.1.20 కోట్లతో పునః నిర్మించినట్లు పాలకమండలి అధ్యక్షుడు మద్దు గోపి పేర్కొన్నారు. ద్రాక్షారామానికి చెందిన ప్రత్యేక శిల్పులు ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. అతి పురాతనమైన శ్రీ మదన గోపాల స్వామి విగ్రహంతో పాటుగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ విశ్వక్సేన, శ్రీ గరుఢ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఏక సమయంలో నిర్వహించనున్నారు. మార్చి 1న తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. దశావతారాలు, అష్టలక్ష్మిలు, గోవర్ధనగిరి, బృందావనం వంటి వాటిని నిర్మించారు. ఆలయ నిర్మాణంలో మతాలకు అతీతంగా ప్రజలు విరాళాలు సమర్పించి మతసామరస్యాన్ని చాటుకున్నారు. జాతరను తలపించేలా ఎనిమిది రోజుల వేడుకకు బంధుమిత్రులకు ఆహ్వానాలు అందజేశారు. గణేష్ సెంటర్ మొదలుకొని కన్నాపురం రోడ్డు పొడవునా జాతీయ ప్రధాన రహదారులు జంగారెడ్డిగూడెం, కొవ్వూరు వైపు, తాడేపల్లిగూడెం వైపు కాషాయ జెండాలను దేవతామూర్తుల విద్యుత్తు కటౌట్లను ఏర్పాటు చేశారు.


కొయ్యలగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ మదన గోపాల స్వామి ఆలయం

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు


గాయపడిన దంపతులు రంగాచారి, వెంకట నరసమ్మ

నూజివీడు: హోలీ పండుగను పురస్కరించుకొని గిరిజన మహిళలు మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై వాహనాలను నిలపడం, రోడ్డుకు అడ్డుగా తాళ్లు కట్టి ఆపడం చేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూజివీడు మండలంలోని లైన్‌తండా వద్ద ఆదివారం ఉదయం 10గంటల సమయంలో హోలీ మామూళ్ల వసూలు చేసేందుకు దాదాపు 10 మంది గిరిజన మహిళలు ద్విచక్ర వాహనానికి అడ్డుగా రావడంతో ప్రమాదం జరిగి ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడుకు చెందిన ఏలూరి రంగాచారి(48), వెంకట నరసమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ దంపతులు ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలోని తమ కుమార్తె ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. లైన్‌తండా వద్దకు వచ్చే సరికి గిరిజన మహిళలు వాహనానికి అడ్డుగా రావడంతో బైక్‌ను కంట్రోల్ చేయక కిందపడ్డారు. దీంతో వెంకట నరసమ్మకు కుడిచెయ్యి విరగగా, రంగాచారికి ఎడమ చేతికి, ఎడమకాలుకి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయకుదురులో చోరీ


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై రమేష్

వీరవాసరం: రాయకుదురులో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. చెల్లబోయిన హరిబాబు, మంగతాయారు దంపతులు ఇంటి ముందున్న షాపులో బంగారం, కొంత నగదును డ్రాయర్ సొరుగులో ఉంచి వెనుకనే ఉన్న ఇంట్లో నిద్రపోయారు. తెల్లవారుజామున డ్రాయర్ సొరుగులో ఉన్న బంగారం, నగదును దొంగిలించుకుపోయారని వాపోయారు. సంఘటన ప్రాంతాన్ని వీరవాసరం ఎస్సై పి.రమేష్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

జగన్ ఆర్యవైశ్యుల గౌరవాన్ని పెంచారు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చింతామణి నాటకాన్ని రద్దుచేసి ఆర్యవైశ్యుల గౌరవాన్ని పెంచారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ద్వారకాతిరుమల క్షేత్రంలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్టు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్‌గా బొండాడ రామ్మోహన్‌రావు (రాంపండు), కార్యదర్శిగా మానేపల్లి సత్యన్నారాయణ(బాబ్జి), కోశాధికారిగా యిమ్మడి శ్రీనివాసరావు, అన్నదానం ఇన్‌చార్జిలుగా యిమ్మడి నాగు, యిమ్మడి సదానంద శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నల్లమెల్లి జగన్నాథరావు, మరో 54 మంది వైస్ చైర్మన్‌లుగా, అదనపు ప్రధాన కార్యదర్శులుగా, అభివృద్ధి కమిటీ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం జరిగిన సభలో కోలగట్ల మాట్లాడుతూ చింతామణి నాటకం వల్ల ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతింటున్నాయని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆ నాటకం ప్రదర్శిస్తున్న వారికి మన రాష్ట్రంలో ఓట్లు ఉన్నప్పటికీ వాటి కోసం ఆలోచించకుండా నాటకాన్ని జీఓ రూపంలో రద్దు చేసి, మన గౌరవాన్ని పెంచారన్నారు. తనకిచ్చిన డిప్యూటీ స్పీకర్ పదవి ఆంధ్ర రాష్ట్ర ఆర్యవైశ్యులకు ఇచ్చిన గౌరవమని ఆయన పేర్కొన్నారు. ఆర్యవైశ్యుడిని కాబట్టే తనకీ పదవి వచ్చిందన్నారు. గతంతో పోలిస్తే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యాపారులపై అధికారుల వేధింపులు తగ్గాయన్నారు. లంచగొండితనం తగ్గిందా? లేదా? అనే విషయాన్ని అందరూ ఆలోచించాలన్నారు. ఎవరైనా లంచం అడిగితే ఫలానా నెంబర్‌కు ఫోన్ చేయమని చెబుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆర్యవైశ్యుల సమస్యలను తీర్చడానికి తనతో పాటు, వెల్లంపల్లి శ్రీనివాస్, మరో ఇద్దరు శాసనసభ్యులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇక ట్రస్టుల విషయానికొస్తే ఒక వ్యక్తి చేయలేని పనిని కొంత మంది ట్రస్టుగా ఏర్పడి చేయొచ్చన్నారు. అందులో భాగంగానే 1999లో ఏర్పాటైన ఈ ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్టు మొక్కగా మొదలై మహా వృక్షంగా మారి, చుట్టుపక్కల ప్రాంతాలకే తలమానికంగా నిలిచిందన్నారు. ట్రస్టు అభివృద్ధిలో చైర్మన్ రామ్మోహనరావు పాత్ర ముఖ్యమైందన్నారు. 24 ఏళ్లుగా ఏకగ్రీవంగా ఆయన ఎన్నికవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం ఆర్యవైశ్య అన్నదాన సదనం చైర్మన్ దేవకీ వెంకటేశ్వర్లు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.


ద్వారకాతిరుమలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్లను గజమాలతో ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం

తప్పుడు కథనాలపై ఆగ్రహం

ముదినేపల్లి రూరల్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షగట్టి అసత్య కథనాలు ప్రచురిస్తున్న ఈనాడు దినపత్రికను దహనం చేసి తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని దాకరం సొసైటీ అధ్యక్షుడు సోమా సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు వీర్ల శ్రీనివాసరావు, పుట్టి శ్రీనివాసరావు, గొర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పత్రిక ప్రతులను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండాల్సిన పత్రికలు కుల జాఢ్యంతో ఒకపార్టీకి కొమ్ము కాస్తూ అసత్య కథనాలు ప్రచురిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించడం దారుణమన్నారు. ఇలాంటి పత్రికల కథనాలను ప్రజలు నమ్మకుండా వాటికి దూరంగా ఉండాలని కోరారు.


పేరూరులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


మేదినరావుపాలెంలో ఈనాడు పత్రిక దహనం చేస్తున్న సర్పంచ్ ఎన్.దుర్గా కుమారి తదితరులు

ఈనాడు పత్రికలు దహనం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న ఈనాడు దిగజారుడుతనం బాధాకరమని మేదినరావుపాలెం సర్పంచ్ దుర్గా కుమారిరాజు అన్నారు. ఆదివారం మేదినరావుపాలెంలో సర్పంచ్, గ్రామస్తులు ఈనాడు పత్రికలను దహనం చేశారు. మరోసారి నిరాధార వార్తలు రాస్తే దీటుగా సమాధానం ఇస్తామన్నారు.

అథ్లెటిక్ చాంపియన్‌గా ఉమ్మడి జిల్లా


100 మీటర్ల పరుగు పందెంలో పోటీ పడుతున్న అథ్లెట్లు



పతకాలు సాధించిన ఉమ్మడి పశ్చిమ జిల్లా క్రీడాకారులు

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అథ్లెట్లు ఆంధ్రప్రదేశ్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సాధించారు. ఆదివారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఏపీ 18వ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా అథ్లెట్లు పలు పోటీల్లో సత్తా చాటారు. 100, 400 మీటర్ల రన్నింగ్, హైజంప్, షాట్‌పుట్ విభాగాల్లో పతకాలు గెలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ చేజిక్కించుకున్నారు. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆకుల హైమా, ఎన్జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ చోడగిరి శ్రీనివాస్, ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ డైరక్టర్ షేక్ ఇస్రాత్, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి ఆదిరెడ్డి సత్యనారాయణ విజేతలకు పతకాలు అందజేశారు. రిటైర్డ్ హెచ్‌ఎం వీరభద్రరావు విజేతలకు రూ.5 వేలు నగదు ప్రోత్సాహకం అందించారని పోటీల ఆర్గనైజేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ చెప్పారు.

వంక రవీంద్రనాథ్‌కు అభినందనలు

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, రాష్ట్ర ఎంఎస్ఎంఈ చైర్మన్ వంక రవీంద్రనాథ్ ఎమ్మెల్సీగా ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఆదివారం తణుకు సజ్జాపురంలోని వంక రవీంద్రనాథ్ నివాసంలో కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలైన జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మత్స రామరాజు, డాక్టర్ వింగ్ జిల్లా అధ్యక్షుడు దాట్ల సుందరరామరాజు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, కార్యదర్శి వెలగల తిమ్మారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాట్ల సురేష్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇండుగపల్లి బలరామకృష్ణ, నార్గన సత్యనారాయణ, గనసాల సింగ్, షేక్ సలీం, అప్పారావు, డోలా సింహాద్రి నాయుడు, రేలంగి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీగా ఎంపికైన వంక రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు

సిలువగట్టు తిరునాళ్లు ప్రారంభం

నూజివీడు: పట్టణ శివారులోని సిలువగట్టు తిరునాళ్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. విజయవాడ మేత్రాసన మోన్‌సిగ్నోర్ రెవ.ఫాదర్ మువ్వల ప్రసాద్ పాల్గొని తిరునాళ్లను ప్రారంభించారు. అనంతరం దివ్యబలిపూజను నిర్వహించారు. సిలువగట్టు పుణ్యక్షేత్రం రెక్టార్ రెవ.ఫాదర్ పెయ్యల మరియదాసు, ఫాదర్ నక్కా డేవిడ్‌రాజు తదితరులు దివ్యబలిపూజలో పాల్గొన్నారు. అనంతరం ఏలియా మాస్టారు ఆధ్వర్యంలో నెహ్రూపేట విచారణ మహిళలు కోలాట నృత్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు దేవుడిపై భక్తితో వ్యవహరించాలని సూచించారు. క్రీస్తు సోదరులంతా ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలన్నారు. తిరునాళ్ళ సందర్భంగా శిలువగట్టు ప్రాంతాన్ని అందమైన విద్యుత్ లైట్లతో అలంకరించారు. విజయవాడ రోడ్డు దగ్గరి నుంచి శిలువగట్టు వరకు రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల విద్యుదీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ నిర్వాహక సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● కిటకిటలాడిన బీచ్


కేపీ పాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పాఠశాలలకు, కాలేజీలకు సెలవు రోజు కావడంతో యువత భారీగా తరలి వచ్చింది. వాతావరణం అహ్లాదకరంగా ఉండటంతో పాటు ఎండ కూడా ఎక్కువగా ఉండటంతో బీచ్‌కు వచ్చిన పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ సేదదీరారు. అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించుకున్నారు. - మొగల్తూరు

ఆధునిక సాగుకు యంత్ర సాయం

- అన్నదాతలకు అండగా జగనన్న ప్రభుత్వం చర్యలు
- యాంత్రీకరణలో భాగంగా పనిముట్లు అందజేత

పెంటపాడు: రైతే రాజు అన్న నానుడిని నిజం చేస్తూ, వ్యవసాయాన్ని పండగ చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. అన్నదాతలను అన్ని రకాలుగా ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టింది. ప్రధానంగా రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు సాయం, పంటలకు బీమా సౌకర్యంతో పాటు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, శాస్త్రవేత్తల సలహాలతో పాటు, ఎన్నో రకాలుగా కోట్లాది రూపాయల నిధులు రైతుల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోంది. మెట్ట ప్రాంతాల్లోని ఉద్యాన తోటలతో పాటు, డెల్టాలో వరి పైరుపై కూడా ఇటీవల డ్రోన్‌ల వినియోగం పెరిగింది. దాని కనుగుణంగా రాబోయే రోజుల్లో డ్రోన్‌లు రైతులు నేరుగా పొందే అవకాశం ఉంటుంది. డ్రోన్ల వినియోగంపై అధికారులు శిక్షణ ఇస్తున్నారు.

ఆధునిక వ్యవసాయం.. యంత్ర పరికరాల వినియోగం

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతుకు తోడ్పాటునందిస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రభుత్వం తీసుకొస్తోంది. రైతులను సంఘటితం చేసి తమకు అవసరమైన యంత్ర పరికరాలు వారే ఎంచుకొనే విధంగా ప్రభుత్వం చైతన్య పరుస్తోంది. ఎంపిక చేసుకున్న పరికరాలను సబ్సిడీపై అందిస్తోంది. గత ప్రభుత్వంలో ఏదో ఒక పరికరాన్ని తెచ్చి దానిని సబ్సిడీపై తీసుకోవాల్సిందిగా రైతులను ఆదేశించేవారు. వాటిలో రైతులకు ఉపయోగపడనివే అత్యధికంగా ఉండేవి. నేడు అన్ని రకాల యంత్ర పరికరాలు అధిక శాతం సబ్సిడీపై రైతులు ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు.



పవర్ ట్రిల్లర్‌పై రైతులకు అందజేస్తున్న అధికారులు (ఫైల్)



సబ్సిడీపై అందించిన వరికోత యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు (ఫైల్)

కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా సేవలు

జగనన్న ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసింది. సాగు చేసే రైతుల అవసరాలను గుర్తించి వాటినే రైతులకు అందజేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీని ద్వారా అన్ని రకాల పనిముట్లతో పాటు, కలుపుతీసే యంత్రాలు, పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్‌లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

యంత్రాలు అందజేత

పెంటపాడు మండలంలో రైతులకు ఇప్పటికే ఈ ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై కోట్లాది రూపాయల పనిముట్లు అందజేసారు. ట్రాక్టర్లు- 2, పవర్ ట్రిల్లర్లు -30, రోటేవేటర్లు- 2, కోత యంత్రాల-2, గడ్డి చుట్టే యంత్రాలు-2, తైవాన్ స్ప్రేయర్లు, రైతులకు అధికారులు అందజేశారు.

యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆధునిక వ్యవసాయంలో భాగంగా శాస్త్రవేత్తల సూచనలు సలహాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడంతో పాటు, కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూలీల కొరతను నివారించేందుకు యంత్రాల వినియోగం అవసరం. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు ఇప్పటికే 9 గ్రూపులకు అందజేసాం. మరింత మంది వీటిని పొందేందుకు వీలుగా ఐదుగురు చొప్పున సభ్యులు గ్రూపులుగా ఏర్పడాలి. దరఖాస్తు చేసుకున్నవారికి యంత్రాలు సబ్సిడీపై అందిస్తాం వివరాల కోసం వ్యవసాయశాఖ అధికారుల, రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలి.

– కె. పార్థసారథి, మండల వ్యవసాయాధికారి

రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

అత్తిలి: తణుకు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారుల ఆధునికీకరణ పనులు జూన్ నెలాఖరుకు పూర్తిచేసేలా చర్యలు చేపట్టామని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం అత్తిలిలో విలేకరుల సమావేశంలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వేసిన రోడ్లు తప్ప, గత ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డుకూడా నిర్మించిన దాఖలాలు లేవన్నారు. మళ్లీ ఇప్పుడు తణుకు నియోజకవర్గ పరిధిలో 50 పంచాయతీరాజ్ రోడ్లు, 25 ఆర్అండ్‌బీ రహదారులు మంజూరు అయ్యాయని, త్వరలో పనులు చేపడతామన్నారు. ధాన్యం డబ్బులు రైతులు ఖాతాలో దాదాపుగా జమ అయ్యాయన్నారు. రైతులు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, దళారీ వ్యవస్థ లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. గృహనిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు వారి ఖాతాలో జమ అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల సత్యనారాయణ, ఆకుల పండుస్వామి, గంటా నాగరాజు, కాసగాని అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు

తాడేపల్లిగూడెం రూరల్: హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవాలని రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్.అగ్రహారం జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరభద్రరావు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ఒక బాధ్యతగా వాహనదారులు భావించాలన్నారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి వాహనదారులు బయటపడిన సంఘటనలను గుర్తు చేశారు. పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

ఆదర్శ అవార్డుల ప్రదానం



తణుకులో సన్మానిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

తణుకు: కరోనా కష్ట కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పేదలకు చేసిన సేవలకు గాను తణుకు పట్టణానికి చెందిన ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆదర్శ అవార్డులను అందజేశారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 36 మందికి అవార్డులను అందజేసిన నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. ఎం.జయరాజు, రిటైర్డ్ డీఎస్పీ జాన్ కెనడీ, జార్జి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సభ్యులు జాన్ కెనడీ, స్వరూప్‌దత్, మధు, జయబాబు, సెబాస్టిన్, ఆశీర్వాదం, సుగుణ, సామ్యూల్‌రాజు, ఎబినేజర్, దేవదాసు, సాల్మన్‌రాజు, ప్రభుపాల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



అత్తిలిలో మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: బల్లిపాడులో వేంచేసియున్న శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీమదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల ఆహ్వాన పత్రికలను పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఆదివారం అత్తిలిలో ఆయన నివాసంలో శ్రీమదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన శుభపత్రికలను ఆవిష్కరించి, ఆలయ పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, ఈవో చందక దార బాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, కందుల సత్యనారాయణ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు అవగాహన

సాక్షి,భీమవరం: సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులను తమ ఇంటి పిల్లల మాదిరిగా చూసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి జి.గణపతిరావు హాస్టళ్ల సిబ్బందికి సూచించారు. బీసీ సంక్షేమ శాఖా ద్వారా పదో తరగతి హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ తరగతులు ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు యోగా క్లాసులు నిర్వహించి సైకాలజిస్టుల ద్వారా పరీక్షల మానసిక సన్నద్ధతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని అన్నారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం హాస్టల్లో భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన వినిస్టన్ బాబు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామానికి చెందిన కుంచిలపల్లి వినిస్టన్‌బాబు ఆదివారం జిల్లాలోని ఇద్దరు మంత్రులను కలిసి ఆశీస్సులు కోరారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణలను కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి తనను యూత్ అధ్యక్షుడుగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, బూరుగుపల్లి సొసైటీ అధ్యక్షుడు బోనం మల్లేశ్వరరావు ఉన్నారు.

గృహ సారథులతో మంత్రి సమావేశం



ఇరగవరం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంచి ఉద్దేశంతో గృహ సారథులను నియమించారని రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇరగవరంలో గృహ సారథులతో సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈ సంక్షేమ పథకాలు అందరికి అందేలా గృహ సారథులు పని చేయాలని పేర్కొన్నారు. సీఎం జగన్ మానస పుత్రికలు, పుత్రులు గృహ సారథులన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, కె.ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ పాలా పాలేశ్వరావు, నాయకులు యుగంధర్, ఇందుగుపల్లి బల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం



పడాల మార్కెట్ యార్డులో మిర్చి విక్రయాలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ వెంకటరమణ

తాడేపల్లిగూడెం రూరల్: ఎండుమిర్చి రైతులకు మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, రైతులు తమ పంటను విక్రయించి లబ్ధి పొందాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకటరమణ అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణ పరిధి పడాల మార్కెట్ యార్డులో ఎండుమిర్చి అమ్మకాలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ సీజన్‌లో చోడవరం, ఘంటావారిగూడెం, పోలవరం, గుంటూరు, జంగారెడ్డిగూడెం, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మిర్చి రైతులు మార్కెట్‌కు వచ్చారన్నారు. కిలో రూ.400 నుంచి రూ.500 వరకు ఉత్తరాది రకం (లావులు), రూ.210 నుంచి రూ.250 వరకు సన్నాలు ధర పలుకుతున్నాయన్నారు. ప్రస్తుతం రెండు వేల బస్తాల వరకు పంట మార్కెట్ యార్డుకు వచ్చిందన్నారు. రైతులు తమ పంట విక్రయించి తిరిగి స్వగ్రామాలకు చేరే వరకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రైతులకు ఏ విధమైన ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి ఎంఎస్‌వీ.ప్రభాకర్, సూపర్‌వైజర్ బి.గోపాలకృష్ణ, కె.హరిబాబు, బి.అప్పారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం సొసైటీ ఆవరణలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రైతు సేవలతో పాటు వైద్య శిబిరాలను సొసైటీలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నేత కొట్టు విశాల్ అన్నారు. ఆదివారం మండలంలోని కొమ్ముగూడెం సొసైటీ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత శిబిరాన్ని కొట్టు విశాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం తాడేపల్లిగూడెం యూనియన్ ఆసుపత్రి వైద్యులు వి.జీవన్‌బాబు, టి.కళ్యాణ్ చక్రవర్తి, పీఎస్‌ఎస్‌కేవీ.గుణసూర్య, సీహెచ్.రేణుక, సీహెచ్.నవీన్, కె.బాబు సులేఖ్‌లు గుండె, ఎముకలు, జనరల్, న్యూరాలజీ, జనరల్ సర్జరీ, చిన్నపిల్లలు 350మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, కొల్లా విజయలక్ష్మికుమారి, చుంద్రు శ్రీను, సొసైటీ సీఈవో సీహెచ్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

మానవత సభ్యుల ఆర్థిక సాయం



తేతలి సాయిబాబారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: పెనుమంట్ర మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇద్దరు రోగులకు రూ. 6 వేల చొప్పున వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. పెనుమంట్ర శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం మార్టేరు మానవతా కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు చిర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మార్చిలో మార్టేరులో మెగా వైద్య శిబిరం నిర్వహణ, ఆహార పదార్థాల సేకరణ, పంపిణీ వంటి అంశాలపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మార్టేరు విజయ కేటరింగ్ అధినేత కర్రి అచ్యుతరామారెడ్డి, పెనుమంట్ర సాయినాథ కల్యాణ మండపం అధినేత తేతలి సాయిబాబారెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణరాజు, సెక్రటరీ బాణాల శ్రీనివాసరావు, ట్రెజరర్ ఎస్.మురళీకృష్ణ, రామచంద్రారెడ్డి, చిర్ల సూర్యనారాయణరెడ్డి, వి.జయదుర్గామాధురి, కర్రి వేణుబాబు, నర్సిరెడ్డి, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు

వీరవాసరం: బాలేపల్లి దళితపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన మూడు కుటుంబాల వారిని ఆదివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం ఏర్పాటు చేసిన బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లను మోషేనురాజు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. మోషేనురాజు బాధితులకు కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని పథకాలు, నూతన గృహాలు మంజూరు చేయించడానికి కృషి చేస్తానని అన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, యర్రంశెట్టి శ్రీనివాసు, నేతలు జ్ఞాన సుందర్‌రాజు, చిక్కాల రాజు, బొంతు రమేష్, మానుకొండ ప్రదీప్ కుమార్, చికిలే మంగతాయారు, గడ్డం భాస్కర్ రావు, మల్ల శ్యాంబాబు, గోదు షణ్ముఖ బాబు, చిలకపాటి సునీత, పడవల నాని, పాలమూరి బులిరాజు పాల్గొన్నారు.

సంచార వైద్యశాలతో 14 మందికి చికిత్స

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో 14 మందికి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ బొండాడ వెంకటేశ్వర్లు తణుకు పాతూరు, తణుకు పట్టణం, హౌసింగ్ బోర్డు కాలనీ, టీచర్సు కాలనీలో మంచానికే పరిమితమైన వారి ఇంటివద్దకే వె వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, పాల్గొన్నారు.

48 గంటల నిర్విరామ కళా ప్రదర్శనకు ఏర్పాట్లు

తాడేపల్లిగూడెం: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 9,10 తేదీల్లో 48 గంటల నిర్విరామ కళా ప్రదర్శనతో ప్రపంచ రికార్డు నమోదుకు ఏర్పాట్లు చేసినట్లు జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆదివారం తాడేపల్లిగూడెం తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళా క్షేత్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నేడు అత్తిలిలో గృహసారథుల సమావేశం

అత్తిలి: స్థానిక శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం గృహసారథుల సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు పాల్గొంటారని మండల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎల్బీచర్లలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని త్రైత సిద్ధాంత భగవద్గీత చదవడం ద్వారా తెలుసుకోగలుగుతారని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మామిడికుదురు కమిటీ అధ్యక్షులు బండారు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులతో కలిసి ఆయన నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి త్రైత సిద్ధాంత గ్రంథాలను దైవ జ్ఞాన ప్రచారంలో భాగంగా గ్రామస్తులకు గీతా ప్రతులను, ఇతర నీతి, ఆధ్యాత్మిక గ్రంథాలను అందించారు.

ఘనంగా సూర్యహోమం



సూర్యహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: కోవిడ్ మహమ్మారి నుంచి ప్రజలు రక్షించబడాలనే సంకల్పంతో పాలకొల్లు పట్టణంలో సరస్వతి శిశుమందిర్‌లో మొదలు పెట్టిన సూర్యహోమం 144వ వారానికి చేరుకుంది. ఆదివారం కోడిగట్టు సరస్వతి శిశు మందిర్‌లో సూర్యహోమం ఘనంగా నిర్వహించారు. రవీంద్ర బ్రహ్మత్వంలో ఈ హోమం ఏర్పాటు చేశారు. ప్రతీ ఆదివారం సూర్య హోమం నిర్వహిస్తున్నామని, ఇప్పటికి 144 వారాలు పూర్తయినట్లు నిర్వాహకులు కె.వి.ఎల్ నరసింహరావు తెలిపారు. ఈ హోమంలో ఐదుగురు దంపతులు పాల్గొన్నారు. ప్రతీ ఆదివారం జరిగే ఈ సూర్యహోమంలో పాల్గొనే భక్తులు కోడిగట్టు సరస్వతి శిశుమందిర్ వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఫ్యామిలీ ఫ్రెండ్‌షిప్ మీట్‌లో రాజ్యాంగ పీఠిక ప్రతులను పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1983–86 సంవత్సరాల్లో బీఏ డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఫ్యామిలీ ఫ్రెండ్‌షిప్ మీట్ ఉత్సాహంగా జరిగింది. ఆదివారం తణుకులోని ఏపీ ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 1983–86 సంవత్సరాల్లో బీఏ డిగ్రీ చదివిన విద్యార్థుల కుటుంబాలతో సహా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ సంవత్సరాల్లో విద్యా బోధన చేసిన గురువులను సత్కరించారు. అప్పటి రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు సంకు మనోరమ పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం భారత రాజ్యాంగ్యాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగంలోని పీఠికకు సంబంధించిన కాపీలను సభలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్‌లో ఏలూరు సీఆర్ఆర్, రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కంటే మెరుగైన గ్రేడ్ పాయింట్లు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు ఆర్ఎస్ హరినాథ్, రాంపల్లి కృష్ణసాయి, కె.రత్నరాజు, కె.మునిస్వామి, రాధా రాణి, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై బైక్ ర్యాలీ



తణుకులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ ఆంజనేయులు, పోలీసు సిబ్బంది

తణుకు: హెల్మెట్ వాడండి... భద్రంగా ఉండండి... అంటూ ఆదివారం తణుకు పట్టణంలో పోలీసులు నిర్వహించన హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ ఆలోచింపజేసింది. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేసిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కొద్ది నెలలుగా హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తణుకు సీఐ సీహెచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం తణుకు పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతో 60 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తణుకు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య, ట్రాఫిక్ ఎస్సైలు జానా సతీష్, బెన్నిరాజు, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రామాలయం వార్షికోత్సవం



కోదండ రామాలయం వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాకలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం మూడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండపాకలోని శ్రీ కోదండ రామాలయంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.